ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
సోమవారం 30 డిసెంబరు 2024



ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా విధులు..

- రామగుండం సీపీ శ్రీనివాస్



పరేడ్‌ను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహించాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధికి ఎంపికైన నూతన ఆర్మ్‌డ్ కానిస్టేబుల్స్‌కు రామగుండం కమిషనరేట్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ హాజరై సిబ్బంది స్క్వాడ్ డ్రిల్, పరేడ్, మాబ్ ఆపరేషన్ డ్రిల్, స్పెషల్ పార్టీ విధులు, కూంబింగ్ విధులు, వివిధ బందోబస్తులలో రోప్‌పార్టీ విధులు, చేయవలసిన విధులు, చేయకూడని విధుల గురించి, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలను గురించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారి భద్రత ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతల సంరక్షణకు, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా క్యూఆర్‌టీ, స్పెషల్ పార్టీ సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. క్యూఆర్‌టీ బలగాలను విస్తృతంగా వినియోగించి లా ఆర్డర్ నిర్వహించడంలో, ఏదైనా నిరసనలకు వెంటనే స్పందించడంలో, కీలక సమయంలో పౌరుల భద్రతను నిర్ధారించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి, చట్టవిరుద్ధ కార్యకలాపాలు సంభవిస్తే వెంటనే స్పందించేందుకు క్యూఆర్‌టీ బృందాలు వ్యూహాత్మకంగా నివారించడానికి విధులు నిర్వహిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, సంపత్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్


ఎస్సీ సంచార కులాలకు అవకాశాలు కల్పించాలి

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీసంచార కులాలకు కార్పొరేషన్ నిధులు ఏర్పాటు చేసి రాజకీయ, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మాదిగ మిత్ర మండలి జిల్లాఅధ్యక్షుడు భూప్పక సంతోష్ మహారాజ్ అన్నారు. ప్రపంచ మాదిగ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం గోదావరిఖనిలోని మాదిగ మిత్ర మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే భారతదేశంలో 22కోట్ల పైచిలుకు అధికజనాభా ఉన్న జాతి అని పేర్కొన్నారు. జాతి అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ కులాలన్నిటికి సామాజిక రాజకీయ, ఆర్థిక న్యాయం చేయాలని, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జనాభా ప్రతిపాదికన 25శాతంకు పెంచాలని, ఎస్సీసబ్‌ప్లాన్ నిధులను ఆయా కులాల సంక్షేమానికి వినియోగించాలన్నారు. నిధులను దారి మళ్లకుండా చూడాలని, రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో వెనుకబడిపోయిన మాదిగ కులాన్ని జాగృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నెరవేట్ల నర్సయ్య, ప్రభుదాస్, మంద రాజమౌళి, గంగారాం, మిట్టపల్లి సతీష్ కుమార్, గొర్రె రాజు, వినయ్‌కుమార్, చిరంజీవి, రాకేష్ పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ మండల కార్యవర్గం

ఎలిగేడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఎంఆర్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా బాసంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా జల్లి రమేష్, బాసంపల్లి వినోద్, మల్లారపు అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా కవ్వంపల్లి సంపత్, అధికార ప్రతినిధిగా అనంపల్లి శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు జిల్లా ఇన్‌చార్జి మంథని చందు, ఎలిగేడు ఇంచార్జి అంబాల నరేష్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కవ్వంపల్లి బాపయ్య, న్యాతరి పోచయ్య శంకర్, కవ్వంపల్లి దుర్గయ్య, రాజేశం, నారాయణ, రాము, మల్లారపు మహేందర్, ప్రధాన కార్యదర్శిగా కవ్వంపల్లి సంపత్, అధికార ప్రతినిధిగా అనంపల్లి శంకర్‌లు పాల్గొన్నారు.

● కమాన్‌పూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం, రొంపికుంట గ్రామాల ఎమార్పీఎస్ కమిటీల ఎన్నిక ప్రక్రియను మండల కన్వీనర్ సిరిసిల్ల శంకర్, అధ్యక్షుడు కుక్క రవిందర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నాగారం గ్రామ అధ్యక్షుడిగా చిప్పకుర్తి నర్సింగం, రొంపికుంట గ్రామ అధ్యక్షుడిగా పులిపాక మొండయ్యలు ఎన్నికయ్యారు. తమపై నమ్మకంతో బాధ్యతలన అప్పగించిన మండల కమిటీ బాధ్యులకు నూతన అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు.



మూలమూలనా గంజాయి మహమ్మారే..

జిల్లాలో ఈ ఏడాది గంజాయి మహమ్మారి పట్టణాల నుంచి గ్రామస్థాయి వరకు విస్తరించింది. యువతే లక్ష్యంగా ఈ దందా సాగుతోంది. గంజాయి స్మగ్లర్లు, పెడ్లర్లు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడ విక్రయాలు జరుపుతు న్నారు. విద్యార్థులకు, యువతకు సరఫరా చేస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు రామ గుండం పారిశ్రామిక ప్రాంతంలో గంజాయి చాక్లెట్ల విక్రయాలు సైతం సాగుతున్నాయి. పోలీసులు పాత నేరస్థులపై నిఘా పెట్టి పలుమార్లు గంజాయిని పట్టుకున్నారు. గర్రె పల్లిలో గంజాయి స్మగ్లర్ నలిమెల వినోద్ నుంచి 1.75కిలోల గంజాయిని స్వాధీనం చేసు కున్నాయి. పెద్దపల్లిలో గంజాయి చాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయికి సంబంధించి 30కేసుల్లో 94మందిని నిందితులుగా చేర్చారు. 30.62కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పెరిగిన నేరాలు

- జిల్లాలో రెట్టింపైన అత్యాచారాలు
- పట్టణాల నుంచి గ్రామాల వరకు గంజాయి
- సైబర్ మోసాలతో హడలిపోతున్న ప్రజలు
- నిరాటంకంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- గోవా స్థాయిలో చిప్‌లతో పేకాట దందా
- ఏసీబీ వలలో తహసీల్దార్లు
- ఏటీఎంలను కొల్లగొట్టిన కేటుగాళ్లు

పెద్దపల్లి జిల్లా పరిధిలో నమోదు అయిన కేసుల వివరాలు

	2023	2024
హత్యలు	16	17
అత్యాచారం	19	35
చీటింగ్	426	450
హత్యాయత్నాలు	46	51
రోడ్డు ప్రమాదాల్లో మరణాలు	107	131
అదృశ్యం	303	251
దోపిడీలు	1	5
పగటిపూట ఇంట్లో దొంగతనాలు	27	15
రాత్రిపూట ఇంట్లో దొంగతనాలు	91	64
కిడ్నాప్‌లు	26	21
అగ్ని ప్రమాదాలు	11	06
మొత్తం	4309	3709

ఇ చలాన్లు: రామగుండం కమిషనరేట్ పరిధిలో 2,89,709 కేసులు నమోదు కాగా, రూ.7,23,76,745 జరిమానాలు విధించారు.



కోల్‌సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ ఏడాది నేరాల సంఖ్య పెరిగింది. హత్య లు, అత్యాచారాలు, సైబర్ మోసాలతో హడలెత్తింది. నగరాల నుంచి గ్రామాల దాకా గంజాయి మహమ్మారి విస్తరించింది. రేషన్ దందా నిరాటంకంగా సాగుతోంది. వం దల టన్నుల బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది. సుల్తానాబాద్ సమీపంలోని కాట్నపల్లి రైస్ మిల్లులో ముక్కు పచ్చలారని ఆరేళ్ల చిన్నారిపై బీహార్‌కు చెందిన కూలీ హత్యాచార ఘటన మానవత్వానికే మచ్చగా మిగిలింది.

పెరిగిన హత్యలు.. అత్యాచారాలు...

గత ఏడాదితో పోల్చితే హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి. 2023లో 16 హత్యలు జరుగగా, 2024లో 17 హత్యలు జరిగాయి. అత్యాచారాల సంఖ్య దాదాపుగా రెట్టింపు అయ్యింది. 2023లో 19హత్యాచార కేసులు నమోదు కాగా, 2024లో 35 నమోదయ్యాయి. అలాగే కుటుంబ కలహాలతో క్షణికావేశంలో జరిగిన హత్యలు కొన్ని అయితే, ఉద్దేశ్యపూర్వకంగా పథకం ప్రకారం చేసిన హత్యలు మరి కొన్ని ఉన్నాయి. ఓదెల మండల కొలనూరులో మాటూరి విజయ్ కుమార్ అనే హోంగార్డును బెల్ట్‌షాపులో రౌడీ షీటర్ పులిపాక శ్రీకాంత్ హత్య చేశాడు. ఈ ఘటన గ్రామీణ ప్రాంతాల్లో సంచలనం సృష్టించింది. కాట్నపల్లిలోని ఒక రైస్‌మిల్లులో ఆరెళ్ల బాలికపై బీహార్ కూలీ వినోద్ మజ్జి మద్యం మత్తులో అత్యాచారం చేసి గొంతు నులిమి హత్య చేశాడు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ప్రత్యేక కోర్టులో కేసు విచారణకు ఆదేశించింది.

సైబర్ మోసాలతో ఉక్కిరి బిక్కిరి..

సమాచారం కోసం వాడుతున్న సెల్‌ఫోన్ సైబర్ నేరాలకు, మోసాలకు సాధనంగా మారింది. గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ఈ బెడద ఉంది. సైబర్ మోసాలకు గురవుతున్న వారిలో విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులే ఎక్కువగా ఉంటున్నారు. సైబర్ నేరాల పరిశోధనకు గోదావరిఖనిలో ప్రత్యేకంగా డీఎస్పీ ఎస్‌హెచ్‌వోగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషనే ఏర్పాటు చేశారు. రూ.7లక్షల లోపు మోసాలు ఆయా పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేస్తుండగా, అంతకుపైగా ఉన్న కేసులు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదు అవుతున్నాయి.

ఆన్‌లైన్ బెట్టింగ్ యప్‌లు, ట్రేడింగ్‌ల పేర పెద్దఎత్తున జనం మోసపోతున్నారు. రామగుండం పట్టణానికి చెందిన ఎన్‌టీపీసీఎల్‌లో పనిచేసే ఒక అధికారిని అదే పట్టణానికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రూ.1.36కోట్లకు ట్రేడింగ్ పేర మోసగించాడు. ముత్తారం మండలం హరిపురంనకు చెందిన ఎర్ర వెంకటనాగరాజు, రామంచ సౌజన్య దంపతులు వివాహ మ్యాట్రిమోనీ పేరుతో రూ.17లక్షలకు మోసగించారు. గోదావరిఖని చెందిన ఒక చికెన్ సెంటర్ నిర్వాహకున్ని రూ.9లక్షలకు మోసగించారు. బ్లూచిప్ ట్రేడింగ్ పేర ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.20కోట్లకు మోసాలకు పాల్పడ్డారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ప్రమోషన్‌ల పేర 55క్లబ్, 80క్లబ్ పేర యువతను ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ యాప్‌ల

మిగతా 8వ పేజీలో

రోడ్లు ఊడ్చి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



రోడ్లు ఊడ్చుతూ నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తమను రెగ్యూలర్ చేయాలంటూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆదివారం రోడ్లను ఊడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జాక్ జిల్లా అధ్యక్షుడు తిప్పని తిరుపతి మాట్లాడుతూ 20 రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవెర్చాలని డిమాండ్ చేస్తూ పలు రకాలుగా నిరసనలు తెలుపుతున్న పట్టించుకోని దుస్థితి ఉందన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పే చేతితో చీపుర్లను పట్టుకోని రోడ్లను ఊడిచేందుకు సిద్ధమయ్యామని, ఇప్పటికైనా తమ ఉద్యోగాలను రెగ్యూలరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుంభాల సుధాకర్, రాజ్‌కుమార్, సంపత్, రహీమొద్దిన్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎల్లాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

జ్యోతినగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ శాలపల్లి రోడ్డులోని ఎ.రావు ఎటర్నా భవనం ఆవరణలో ఆదివారం ఎల్లాపు సంఘం గోదావరిఖని యూనిట్ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అలాగే ఎల్లాపు కులగణన ప్రారంభించారు. జెమినీ హాస్పిటల్స్ ఎండి చంద మురళీమనోహర్‌రావు, సంఘం గోదావరిఖని గౌరవ అధ్యక్షుడు పుప్పాల విక్రమసింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద రాజకిషన్‌రావు, అధ్యక్షుడు బేతి ప్రభాకర్‌రావు, ప్రధానకార్యదర్శి నాగేందర్‌రావు పాల్గొన్నారు.

గర్రెపల్లి మండలం ఏర్పాటుపై కదలిక..

● 9 గ్రామాలతో కలిపి ప్రతిపాదనలు ● నేడు ప్రభుత్వానికి చేరనున్న నివేదిక ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిని మండలంగా ఏర్పాటు చేసే విషయమై కదలిక వచ్చింది. ఈనెల 26వ తేదీన ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషనల్‌లో 'తెరపైకి గుంజపడుగు మండలం'.. గర్రెపల్లిపై ఊసెత్తని అధికారులు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పందించారు. గర్రెపల్లి మండలం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్‌ను కోరడంతో ఈ మేరకు గర్రెపల్లి చుట్టుపక్కలా గ్రామాలను కలుపుతూ మండలం ఏర్పాటు కోసం నివేదికను అధికారులు రూపొందిస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే ల్యాండ్స్, జిల్లా పరిషత్ అధికారులు మ్యాపింగ్ చేస్తున్నారు. గర్రెపల్లి, భూపతిపూర్, ఐతరాజుపల్లి, దుబ్బపల్లి, నారాయణ రావుపల్లి, సాంబయ్యపల్లి, గొల్లపల్లి, బొంతకుంటపల్లె, నర్సయ్యపల్లె గ్రామాలతో కలిపి గర్రెపల్లి మండలంగా ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత సుల్తానాబాద్ మండలంలో మొత్తం 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో నుంచి 9 పంచాయతీలతో కలుపుకుని గర్రెపల్లి మండలాన్ని ఏర్పాటు చేయనున్నారు. పెద్దపల్లి జిల్లా ఏర్పాటైన సమయంలోనే గుంజపడుగుతో పాటు గర్రెపల్లి మండలాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. కానీ అప్పుడు కేవలం మూడు అంతర్గాం, పాలకుర్తి, రామగిరిలను కొత్త మండలాలుగా ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినప్పటికీ మండలాలు ఏర్పాటు చేయలేదు. మరో రెండు, మూడు మాసాల్లో గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరగనున్నాయి. ఏదైనా కొత్తగా గ్రామ పంచాయతీలు గానీ, మండలాలను ఏర్పాటు చేయాలంటే ఇదే సమయం., ఎన్నికలు పూర్తయిన తర్వాత కొత్త పంచాయతీలు, మండలాలను ఏర్పాటు చేయడం పాలన పరంగా ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్త పంచాయతీలతో పాటు గుంజపడుగు, గర్రెపల్లి మండలాలను ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయి.



గర్రెపల్లి గ్రామం

రాజీవ్ రహదారి పక్కనే..

గర్రెపల్లి గ్రామం రాజీవ్ రహదారిని ఆనుకుని ఉండడం వల్ల మండలంగా ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉంటుంది. ఇక్కడ మండల పరిషత్, తహసీల్దార్, మండల విద్యా వనరుల కేంద్రం, మండల వ్యవసాయ, తదితర కార్యాలయాల కాంప్లెక్సును ఒకే చోట నిర్మించేందుకు అనువైన స్థలం ఉంది. ఈ గ్రామంలో సర్వే నంబర్లు 1603, 1614, 1643, 1645లలో సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇక్కడ ఇప్పటికే సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాలతో పాటు ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల దవాఖాన, జిల్లాలోనే అతి పెద్ద చెరువు, దీని పరిసరాల్లో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల, ఎంబీఏ, తదితర కళాశాలలు ఉన్నాయి. అలాగే విద్యుత్ సబ్‌స్టేషన్, అన్ని రకాల వసతులు ఉన్నాయి. అన్ని రకాల వసతులున్న దృష్ట్యా గర్రెపల్లిని మండలంగా ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూడా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సైతం గర్రెపల్లిని మండలంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయి. ఈనెల 30వ తేదీన ప్రభుత్వానికి జిల్లా అధికారులు ప్రతిపాదనల ఫైల్‌ను పంపించాలని నిర్ణయించారు. కొత్తగా ప్రతిపాదిస్తున్న గుంజపడుగు, గర్రెపల్లి మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే జిల్లాలో మండలాల సంఖ్య 16కు చేరుకోనున్నది.

కాగా, ఈ విషయమై కలెక్టర్ కోయ శ్రీహర్షను ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా గర్రెపల్లిని మండలంగా ఏర్పాటు చేసే విషయమై చుట్టుపక్కల గ్రామాలను కలుపుకుని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సోమవారం ప్రభుత్వానికి ఫైల్‌ను పంపిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

టూరిజం శాఖ బోటు మాయం..?

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



సమ్మక్క జాతర ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బోటు(ఫైల్)

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యాక్ వాటర్‌లో ఏర్పాటుచేసిన బోటు నడవక ముందే కనుమరుగైంది. 2019లో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన తరువాత నిండుకుండలా మారిన గోదావరిపై గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద 50సీట్ల కెపాసిటీతో ఏర్పాటు చేసిన బోటు నడవక ముందే రెండుసార్లు వరదలు వచ్చి కొట్టుకుపోగా ఆ బోటు ప్రస్తుతం కనబడకుండా పోయింది. దీనిపై ఇటు పర్యాటక శాఖ గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోకపోవడంతో ఆ బోటు ఎక్కడికి వెళ్లిందనేది ప్రశ్నార్థకంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన బోటు రెండు సార్లు వచ్చిన వరదలతో కొట్టుకుపోయింది. వరద తాకిడికి తుమ్మ పొదల్లో చిక్కుకున్న బోటును 2023 ఎన్నికల్లో గెలిచిన మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ 2024లో జరిగిన సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా బోటును బయటకు తీయించి బోటులో సౌకర్యాలు ఏర్పాటు చేసి బోటు చుట్టూ లైటింగ్‌ను ఏర్పాటు చేయించి భక్తులను ఆకర్శించే విధంగా తీర్చిదిద్దారు. సమ్మక్క-సారలమ్మ జాతర అయిపోయిన తరువాత ఆ బోటు కనిపించకుండాపోయింది. ఆ బోటు దొంగలు ఎకెత్తుకెళ్లారా లేదా పర్యాటక శాఖ తీసుకెళ్లిందా అంతుపట్టడం లేదు. మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆ బోటు స్థానంలో మరో రెండు బోట్లు ఏర్పాటు చేసి రామగుండాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిందేకు ప్రణాళిక సిద్ధం చేస్తున్న తరుణంలో ఈ బోటు కనిపించకుండా పోయింది. ప్రస్తుతం ఉన్న ఈ బోటును ఇంజన్, విలువైన కేబుళ్లను దొంగలు ఎత్తుకెళ్లారు. బోటును కాపాడేందుకు మున్సిపల్ శాఖ అధికారులు ఒక మనిషిని కూడా ఏర్పాటు చేసింది. సమ్మక్క-సారలమ్మ జాతర అయిపోయిన నుంచి ఈ బోటు కనిపించకపోవడంతో దీనిపై ఆరా తీసుకున్నారు. ఈ బోటును ఎవరు తీసుకెళ్లారనే కోణంలో చర్చ జరుగుతోంది.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి

కమాన్‌పూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద మాజీ ప్రధాని స్వర్గీయ మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప సూచకంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి మన్మోహన్‌సింగ్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, నాయకులు భూంపెల్లి రాజయ్య, సయ్యద్ ఇక్బాల్, అబ్దుల్ రఫీక్, ఎండి ముస్తాక్, దాసరి గట్టయ్య, గడప కృష్ణమూర్తి, నగునూరి నర్సయ్య, మల్యాల మహేష్, మంథని రామస్వామి, సుతారి రాజేందర్, జంగంపెల్లి శ్రీనివాస్, గర్రెపల్లి వెంకన్న, బండారి గట్టయ్య, ఆలీ సత్తయ్య, నజీబ్, మట్ట నర్సయ్య, గొడిసెలా స్వామి, మల్యాల చిన్న తిరుపతి, కొమ్ము సమ్మయ్య, చాట్ల రాజమల్లు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన టీబీజీకేఎస్

- వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి



సమావేశంలో పాల్గొన్న మాదాసు రామమూర్తి, ఇతర నాయకులు

8

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

- అభినందించిన ఉపాధ్యాయులు



కబడ్డీ పోటీలకు ఎంపికైన నిట్టూరు విద్యార్థులు

6

స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం

మల్లాపూర్, డిసెంబరు, 29 (ఆంధ్రజ్యోతి): పక్షం రోజుల క్రితం దుబాయ్‌లో జరిగిన బస్సు బోల్తా ఘటనలో జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన మానల అశోక్(47) చికిత్స పొందుతూ మరణించగా ఆయన మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. శవపేటికను చూసిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. అశోక్ నాలుగు నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. బస్సు ప్రమాదంలో మృత్యు వాత పడి విగత జీవిగా మల్లాపూర్‌కు చేరుకోవడంతో విషాద చాయలు అలుముకున్నాయి. అశోక్‌కు భార్య లక్ష్మి, ముగ్గురు కూ తుళ్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివారల ప్రకారం...రాజస్థాన్‌లోని కైలాస్‌నగర్‌కు చెందిన మీనా కిషన్(20) బతుకుదెరువు కోసం మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్‌కు రెండేళ్ల క్రితం వచ్చాడు. గ్రామంలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లికి వెళ్లి తిరిగి గ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మీనా కిషన్ ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడా, మరేదైన వాహనం ఢీకొన్నదా అని దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక మహిళ ఆత్మహత్య

చొప్పదండి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సంకేపల్లి శంకరమ్మ(51) అనే మహిళ ఒంటరితనం భరించలేక ఇంటిలో ఉరివేసుకుని మృతిచెందినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. శంకరమ్మ దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఇద్దరికి వివాహాలు అయ్యాయి. కుమారుడు కరీంనగర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు గోదావరిఖనిలో ఉంటోంది. భర్త శంకరయ్య, కరీంనగర్‌లో కుమారుడి వద్ద ఉంటున్నాడు. శంకరమ్మ చొప్పదండిలో ఉంటున్నది. ఒంటరితనంతోపాటు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శంకరమ్మ కుమారుడు సుంకేపల్లి సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన జి శ్రీనివాస్, ఎం సతీష్‌లు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టాటా ఏసీ వాహనం ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సతీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సులో గుండెపోటుతో వృద్ధుడి మృతి


మృతి చెందిన ఆకుల గంగయ్య

గంగాధర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంగాధరలో ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఐతుపల్లి గ్రామానికి చెందిన ఆకుల గంగయ్య (70) ఆదివారం కరీంనగర్‌కు పని నిమిత్తం వెళ్లాడు. ఇంటికి చేరేందుకు కరీంనగర్ నుంచి లింగాపూర్ వెళ్లే బస్సు ఎక్కాడు. బస్సు గంగాధర మండలం మధురానగర్ చౌరస్తా సమీపానికి వచ్చిన గంగయ్య గుండెపోటుకు గురై ఇబ్బంది పడ్డాడు. ప్రయాణికులు గమనించి బస్సు డ్రైవర్‌కు విషయం చెప్పారు. డ్రైవర్ వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బస్సును మళ్లించాడు. ప్రయాణికులు గంగయ్యను పీహెచ్‌సీలోకి తీసుకెళ్లారు. పరీక్షించిన సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో గంగయ్య కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఐతుపల్లికి తీసుకెళ్లారు.

గోదావరిలో దూకి వ్యాపారి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో దూకి ఖనికి చెందిన వ్యాపారి నాగవెల్లి సత్యనారాయణ(58) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక మేదరిబస్తీలో పెయింటింగ్ షాప్ నిర్వాహకుడు సత్యనారాయణ మధ్యాహ్నం తన స్కూటీపై గోదావరి బ్రిడ్జి మీదకు వెళ్ళాడు. స్కూటీని వదిలి ఆధార్ కార్డు వాహనంపై ఉంచి నదిలో దూకాడు. కొద్దిసేపటికి మృతదేహం ఒడ్డుకు కొట్టుకురావడంతో పోలీసులు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సత్యనా రాయణకు భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. తన భర్త అనా రోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు సత్యనారాయణ భార్య జయప్రద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు టుటౌన్ పోలీసులు తెలిపారు.

జగిత్యాలలో బాలిక కిడ్నాప్‌నకు యత్నం

జగిత్యాల క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలో ఐదేళ్ల బాలికను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన దంపతులు తమ ఐదేళ్ల కూతురుతో కలిసి జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణి నగర్ ప్రాంతంతో పని నిమిత్తం చేరుకున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న హోటల్ వద్ద దంపతులు ఉండగానే తన కూతురుని మద్యం మత్తులో సిరిసిల్లా జిల్లా కేద్రానికి చెందిన నవీన్ అనే యువకుడు అపహరించేందుకు యత్నించాడు. గమనించిన బాలిక తండ్రి అరుపులు పెట్టడంతో స్థానికులు యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జన జీవన స్రవంతిలో కలవాలి


నిత్యావసర సరుకులు అందజేస్తున్న డీఎస్పీ రాములు

కోరుట్ల రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనజీవన స్రవంతిలో కలిసి కటుంబ సభ్యులకు దగ్గర కావాలని మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రా ములు మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు తిప్పిరి తిరుపతి కుటుంబ సభ్యులను కలిసి కోరారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న తిరుపతి కుటుంబ సభ్యులను కలిసి నిత్యావ సర సరకులను అందించారు. కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకు న్నారు. పిల్లల చదువులు ఎలా సాగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటి సభ్యుడిగా ఎదిగిన తిరుపతి కుటుంబ సభ్యుల పరిస్థితిని గమనించి ప్రభుత్వానికి లొంగిపోవాలని ఈ సందరంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సీఐ సురేష్‌బాబుతో పాటు ఎస్‌ఐ శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒగ్గు కథలతో చైతన్యం

- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారుడు
- తెలంగాణ ఉద్యమంలో ఊరూరా పర్యటనలు
- కరోనా మహమ్మారిపై ప్రదర్శనలు
- ఢిల్లీ వేదికగా ఒగ్గుకథకు గుర్తింపు


ఢిల్లీలో ప్రదర్శన ఇస్తున్న దేవయ్య, బృంద సభ్యులు (ఫైల్)

తంగళ్లపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒగ్గు కథల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపుతున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండే పల్లి గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు దేవయ్య. మండేపల్లి గ్రామానికి చెందిన దేవయ్యకు చిన్నతనం ఒగ్గు కథలంటే ఆసక్తి. తన తాత ఒగ్గు రాజనర్సు నుంచి కథలు చెప్పడం నేర్చుకున్నాడు. సామాజిక అంశాలను ఒగ్గు కథకు జోడించి ప్రదర్శనలు ఇవ్వడం దేవయ్య ప్రత్యేకత.

దాదాపు 20 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాడు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఊరూరా తిరుగుతూ ఉద్యమ స్ఫూర్తిని రగిలించాడు. కరోనా కాలంలోనూ వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఒగ్గు కథల ద్వారా అవగాహన కల్పించాడు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఒగ్గు కథ ప్రదర్శనలు ఇచ్చాడు. ఆజాదీ కా అమృత్ మహో త్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం, సంగీత నాటక ఆకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఎనిమిది మంది ఒగ్గు కథ కళాకారుల బృందంతో ప్రదర్శన ఇచ్చాడు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆంగ్లేయులను గడగడలాడించిన తెలంగాణవాసి రాంజీ గోండు వీరగాధను ప్రదర్శించి జాతీయ స్థాయిలో ఒగ్గు కథ గుర్తింపును చాటాడు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాల ఒగ్గు కథ మహోత్సవానికి ఆహ్వానం అందు కున్నాడు. గూగుల్ మీట్ ద్వారా ప్రదర్శన ఇచ్చి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాడు.

ప్రభుత్వ కార్యక్రమాలతో గుర్తింపు

ఒగ్గు దేవయ్య, కళాకారుడు, మండేపల్లి

ప్రభుత్వ కార్యక్రమాల్లో సామాజిక అంశాలపై ప్రదర్శనలు ఇవ్వడంతో గుర్తింపు వచ్చింది. ఒగ్గు కథకు అంత ర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన కళాకారుడు మిద్దె రాములును స్ఫూర్తిగా తీసుకొని ముందు కెళ్తున్నాం. మల్లన్న దేవుడి పట్నాలు ఎక్కువగా వేస్తాం. వ్యవసాయం చేసుకుంటూ ప్రదర్శనలు ఇస్తున్నా.



ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం కేటాయించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ఐదు శాతం వాటా కల్పించాలని తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ సదరంలో దొర్లిన తప్పులను సవరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో దివ్యాంగులు బస్సు ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా మారిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు రెండు, మూడు సీట్లను ప్రత్యేకంగా కేటాయించాలని కోరారు. మహిళ దివ్యాంగుల కోసం జిల్లా కేంద్రంలో వసతి గృహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్హతతో సంబంధం లేకుండా అర్హులైన దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనం మంజూరు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులకు ఐదు శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగిరి జగదీశ్వం చారి, కాసారంపు పర్శరాములు, ఆకుల చంద్రశేఖర్, అజీజ్, జి పద్మ, బి స్వరూప, ఆర్ అరుణ, నాగరాజు, మహేందర్, పోచమల్లు, జె రాజన్న, కె నాగరాజు, కామెర వెంకటేష్, విష్ణు, తిరుపతి, మల్లేశం, శ్రీనివాస్, ప్రభాకర్, సంపత్ పాల్గొన్నారు.

రూపాయి బిళ్ల పై మన్మోహన్ సింగ్ చిత్రపటం

గొల్లపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవ పట్నం గ్రామానికి చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు, సైకత శిల్పి గాలిపెల్లి చోళేశ్వరా చారి రూపాయి బిళ్ల పై మాజీ ప్రధాని, స్వర్గీయ మన్మోహన్ సింగ్ చిత్ర పటం చిత్రీకరించి ప్రతిభను చాటాడు. మన్మోహన్ సింగ్‌కు రూపాయి బిళ్ల పై తన చిత్రం లిఖించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్థిక సంస్క రణలకు చిహ్నంగానే రూపాయి బిళ్లపై వారి చిత్ర పటంను వేసినట్లు చోళేశ్వరాచారి తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.


రూపాయి బిళ్లపై స్వర్గీయ మన్మోహన్ సింగ్ చిత్ర పటం


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు


రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న పాట్నా హైకోర్టు జడ్జి

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు రెండు గంటలపాటు నిరీక్షించారు. అనబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

● కాగా వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఆదివారం పాట్నా హైకోర్టు జడ్జి జి.అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆమెకు సిరిసిల్ల సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మేఘన పూల మొక్కను అందజేశారు. అనంతరం రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆమెకు ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఈవో వినోద్‌రెడ్డి స్వామివారి పట్టు వస్త్రాలను అందజేశారు. తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి రాజన్న ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 2023 నుంచి అమలు కావలసిన పీఆర్సీ 18 నెలలు ఆలస్యమైందని, వెంటనే ప్రభుత్వం పీఆర్సీ నివేదిక తెప్పించుకుని 42 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలో కనీసం రెండు డీఏలను ఇవ్వాలన్నారు. 20 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని, వెంటనే వారిని చర్చలకు పిలవాలని కోరారు. ఆదర్శ పాఠశాలలను పాఠశాల విద్యా డైరెక్టరేట్‌లో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏరుకొండ నర్సింహాస్వామితోపాటు 33 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మునగాల మణిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు, పోలంపల్లి ఆదర్శన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లాశాఖ అధ్యక్షుడు పటోళ్ల బలవంత్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సోగల సుదర్శన్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జుర్రు నారాయణ, పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కనుమల్ల రవికుమార్, మహ్మద్ మన్సూర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంప చంద్రశేఖర్, కామారెడ్డి జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి ముజీబుద్దీన్, కాంట్లే గోపాల్, మోహన్, రమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

రంగరావుపేటలో చిరుతపులి కలకలం

- కుక్కలపై దాడి చేసిందని గ్రామస్థుల భయాందోళన


చిరుతపులి పాదముద్రలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రంగరావుపేట గ్రామ శివారులోని వ్యవసాయ చేన్ల వద్ద చిరుత పులి సంచారం కలవరం రేపుతోంది. గ్రామ శివారులోని తాతమ్మ గుడి సమీపంలో రెండు కుక్కలపై దాడి చేసి ఒక్కదాని ఎత్తుకెళ్లగా మరొక్క దాని కళేబరాన్ని ఆదివారం ఉదయం గ్రామస్థులు గుర్తించారు. గ్రామస్థులు తెలిపిన వివారల ప్రకారం..గ్రామానికి చెందిన సంగెపు రమేష్ మొక్కజొన్న తోటలో రెండు పెంపుడు కుక్కలను శనివారం రాత్రి కట్టేసి వెళ్లాడు. వాటిపై చిరుత పులి దాడి చేసి దానిని చంపిందని రైతు రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. చిరుతపులి ఈడ్చుకెళ్లిన గుర్తులు, పాదముద్రల గుర్తులు కనిపించడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ బీట్ అధికారి సత్తార్ సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ ఉన్న పాదముద్రలు, గుర్తులను పరిశీలించాడు. రాళ్లతో కూడిన మట్టి నేల కావడంతో పాదముద్రలు చిరుతపులివా ? లేక మరేదైనా జంతువా అని గుర్తించడం కష్టంగా ఉందని, ఉన్నత అధికారులతో పూర్తి స్థాయిలో పరిశీలించి ఏ జంతువు అనేది నిర్ధారిస్తామన్నారు. చిరుత పులి సంచరిస్తున్నట్లు తెలియడంతో రైతులు తమ పొలాల దగ్గరకు వెళ్లడానికి భయపడుతున్నారు. గొర్రెలు, పశు పెంపకదారులు సైతం సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లడానికి ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతపులి బంధించి, ఇతర ప్రాం తాలకు తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పోచమ్మ ఆలయంలో చోరీ

హుజూరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిధిలోని దమ్మక్కపేట గ్రామ పోచమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. పోచమ్మతల్లి ఆలయాన్ని శుభ్రం చేయడం కోసం శనివారం ఉదయం భద్రయ్య అనే వ్యక్తి వచ్చాడు. ఆలయ ద్వారం తాళం పగలగొట్టి ఉండడంతో స్థానికులకు చెప్పాడు. సుమారు రూ. 1.50లక్షల విలువ గల ఆలయంలోని ఇత్తడి దీపం, కుదురు, ఇత్తడి గంట, 15గ్రాముల అమ్మవారి పుస్తలతాడు చోరీ జరిగినట్లు చెబుతున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన రాఘవపూర్ విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పెద్ది శ్రీనిత్య, కుంట ప్రణీత, గాయత్రి ముగ్గురు విద్యార్థులు సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు తెలిపారు. సోమవారం వరంగల్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పీడీ శైలజ వారిని అభినందించారు. కాగా సీఎం కప్ 2024లో భాగంగా నిర్వహించనున్న కబడ్డీ పోటీలకు పెద్దపల్లి మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు వినయ్, నవీన్, నగేష్, అశ్విన్, వినయ్, బాలికల విభాగంలో సాత్విక, అక్షర, లావణ్య ఎండీ టీనా, వర్షలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య తెలిపారు. వరంగల్‌లో ఈనెల 30 నుంచి జనవరి 2 వరకు జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

బెల్ట్‌షాపులో తనిఖీలు

జమ్మికుంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పిట్టలవాడలో గల బెల్ట్‌షాపులో పోలీస్‌లు ఆదివారం తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో రూ.3080 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మద్యం నిల్వ చేసిన బొంగోని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

రాయికల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని త్రికూటాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం చండీ పరివార్, అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి ఊరేగింపు, గణపతి హోమం, అభిషేకం చేయగా, రాత్రి మహా పడిపూజను కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మునుగోటి సత్యనారాయణ శర్మ, సాయి సుధీర్ శర్మ, భరత్ శర్మ, స్కందత్, గుడికోట ఆలయ కమిటీ, చండీ పరివార్ సభ్యులు, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

వరుస రోడ్డు ప్రమాదాలు

- మూడు రోజుల్లో ఏడుగురికి గాయాలు

హుజూరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణ శివారులోని హనుమకొండ ప్రధాన రహదారిపై కేసీ క్యాంప్ సమీపంలో వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు రోజుల్లో జరిగిన ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున రాజన్న సిరిసిల్ల జిల్లా ఆదర్శ పాఠశాల విద్యార్థులు విహారయాత్రకు వెళ్లి వస్తుండగా కేసీ క్యాంపు వద్ద వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఇందులో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. అదేరాత్రి శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కాగా గురువారం రాత్రి హుజూరాబాద్ పరకాల క్రాస్ రోడ్ సమీపంలో టాటా ఏసీ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో జూపాక గ్రామానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. అరగంట సమయంలోనే డిపో క్రాస్ రోడ్ వద్ద డివైడర్‌ను బోలేర వాహనం ఢీ కొట్టడంతో చెల్పూర్ గ్రామానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వరుసగా మూడ్రోజుల్లో నాలుగు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు గాయపడడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ఎన్‌హెచ్-563పై వాహనాల రద్దీ బాగా పెరిగిందని, నేషనల్ హైవే అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



హుజూరాబాద్‌లో ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

ముగిసిన సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి సీఎం కప్-2024 జూడో పోటీలు ముగిశాయి. మూడు రోజులుగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఈసీ మెంబర్ మహేందర్ చివరిరోజు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు 29 జిల్లాల నుంచి 400 మందికిపైగా క్రీడాకారులు పాల్గొనగా వీరందరికి కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో మూడు రోజులు వసతి, సౌకర్యాలు కలెక్టర్ సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జూడో అసోసియేషన్ మెంబర్స్, టెక్నికల్ అసోసియేషన్ మెంబర్స్, పీఈటీ, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. విజేతలకు హైదరాబాద్‌లో జరగనున్న బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం చేతులమీదుగా పతకాలను, నగదు పురస్కారాలను అందించనున్నారు.

● **బాలికల విభాగంలో విజేతలు..**

- 48 కేజీల విభాగంలో ఎస్ రమ్య(ఆదిలాబాద్), సీహెచ్ క్రిస్మస్(భద్రాద్రి కొత్తగూడెం), బి నక్షత్ర(హనుమకొండ) గెలుపొందారు.
- 52కేజీల విభాగంలో ఆర్ చాందిని(ఆదిలాబాద్), సావిత్రి(నారాయణపేట), చరిష్మ(యాదాద్రి భువనగిరి)
- 57 కేజీల విభాగంలో కె అలేఖ్య(ఆదిలాబాద్), బి స్పందన(ఖమ్మం), తేజశ్రీ(నిజామాబాద్), 63 కేజీల విభాగంలో ఎన్ శ్రీజ(వరంగల్), వి కావ్య(సూర్యాపేట), వి సాయిప్రీతి(రంగారెడ్డి), 70 కేజీల గ్రిల్స్ విభాగంలో కె రేవతి(వికారాబాద్), ఎ సుష్మిత(కరీంనగర్), కె కృపా(హన్మకొండ)
- 70 కేజీలపై విభాగంలో ఎంఎస్ శివాని(హైదరాబాద్), వెంకట రితిక(కరీంనగర్), కె బ్లెస్సీ(సూర్యాపేట) విజేతలుగా నిలిచారు.

● **బాలుర విభాగంలో విజేతలు..**

- 50 కేజీల విభాగంలో ఎల్ సతీష్(ఆదిలాబాద్), ఎ రామతేజ(నిజామాబాద్), బి గణేష్(కరీంనగర్),
- 55కేజీల విభాగంలో ఆర్ తరుణ్(ఆదిలాబాద్), పి ప్రశాంత్(భద్రాద్రి కొత్తగూడెం), ఎండీ సుతుద్దిఖాన్(హైదరాబాద్)
- 60 కేజీల విభాగంలో శ్రీహరి(జోగులాంబ గద్వాల్), బి సతీస్ కుమార్(ఖమ్మం), ఎం హర్షవర్ధన్(ఆదిలాబాద్)
- 66కేజీల విభాగంలో కె అఖిల్(జయశంకర్ భూపాలపల్లి), ఆర్ గణేశ్(కరీంనగర్), ఎండీ నసీరుద్దీన్(వరంగల్),
- 66 కేజీల పై విభాగంలో కె సంజీవ్(హైదరాబాద్), బి రవి(మహబూబాబాద్), ఆర్ మధు(ఆదిలాబాద్) విజేతలుగా నిలిచారు.

రాష్ట్రస్థాయి సీఎంకప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో.. ఉమ్మడి జిల్లా జట్టుకు తృతీయ స్థానం



తృతీయ స్థానం సాధించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీఎంకప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానం సాధించింది. ఈ నెల 27 నుంచి 29 వరకు హన్మకొండలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కాసర్ల ఆనంద్ కుమార్, రమణరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘ బాధ్యులు పెద్దపల్లి కన్వీనర్ సురేందర్, సిరిసిల్ల కన్వీనర్ జె కృష్ణహరి, జగిత్యాల కన్వీనర్ పెద్దబోయిన శ్రీనివాస్, ప్రేమ్, విద్యాసాగర్, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళలకు డ్రైవింగ్ స్కూల్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

● మూడు వేల మందికి శిక్షణ
● శిక్షణ ఇచ్చేది మహిళే

డ్రైవింగ్ వచ్చి ఉండడం ఇప్పుడు మహిళలకు అవసరంగా మారింది. మోటారు డ్రైవింగ్ స్కూల్స్‌లో పురుషులే ఉండడంతో మహిళలు ఇబ్బందిపడుతున్నారు. ఈ ఇబ్బందులను తొలగించాలనుకు అమ్ము మోటార్ డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించారు కరీంనగర్‌కు చెందిన అమ్ము స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు పోతుగంటి సుజాతరెడ్డి. కరీంనగర్‌లో మూడేళ్లుగా ఒక మహిళా ట్యూటర్‌తో మూడు వేల మందికి డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి ఉన్న నేపథ్యాన్ని ఆమె 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.



శిక్షణ పొందిన మహిళలతో సుజాత రెడ్డి, శిక్షకురాలు స్వప్న

తోటి మహిళల ఇబ్బంది తెలుసుకుని..

నేను 2006లో మోటార్ కారు డ్రైవింగ్ నేర్చుకున్న సందర్భంలో మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో గమనించాను. నాతోపాటు డ్రైవింగ్ నేర్చుకోవడానికి వచ్చే మహిళల అనుభవాలు, ఇబ్బందులు స్వయంగా తెలుసుకున్నా.. అప్పుడే మహిళ శిక్షకురాలితో ఒక డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించా.. ఆ ఆలోచనను అమలులో పెట్టే క్రమంలో మా స్వచ్ఛంద సంస్థ ద్వారా పరిచయమైన గొల్లపెల్లి స్వప్నకు డ్రైవింగ్ వచ్చన్న విషయం గుర్తుకు వచ్చింది. ఆమె సహాయంతో డ్రైవింగ్ స్కూల్ ప్రారంభించాను ఎందరో గృహిణులు, డాక్టర్లు, వివిధ స్థాయిల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారులు, విద్యార్థినులు మా వద్ద డ్రైవింగ్ శిక్షణ పొందారు.

వాహన మెయింటనెన్స్, కార్యాలయ అద్దె, ఇతర ఖర్చులు పోను శిక్షకురాలు స్వప్న అవసరాలు తీరడానికి కొంత ఫీజు తీసుకుంటాం. ఇప్పటి వరకు మూడు వేల మందికి పైగా మా వద్ద డ్రైవింగ్ శిక్షణ పొందారు. మహిళలకు ఉపయోగపడేలా వివిధ వృత్తుల్లో టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ తదితర వృత్తుల్లో శిక్షణ ఇచ్చే కేంద్రాలు కూడా నెలకొల్పాలని ఆలోచిస్తున్నాం.

డ్రైవింగ్ నాకు ఉపాధి కల్పిస్తోంది..

గొల్లపెల్లి స్వప్న, శిక్షకురాలు

ఆసక్తితో నేర్చుకున్న నేను నేర్చుకున్న డ్రైవింగ్ నాకు ఉపాధి కల్పిస్తోంది. మా వద్ద నేర్చుకునే మహిళలకు 20 రోజుల్లో సంపూర్ణంగా డ్రైవింగ్ వస్తుంది. కొందరు నాలుగైదు రోజుల్లోనే నేర్చుకున్నా ప్రాక్టీస్ కోసం 20 రోజులు శిక్షణ ఇస్తాం.



మహిళలందరూ డ్రైవింగ్ నేర్చుకోవాలి..

కరివేద జ్యోతి, గృహిణి

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికి బైక్, కార్ నడపడం వస్తే బాగుంటుంది. మగవారు ఇళ్లలో ఎప్పుడు అందు బాటులో ఉండక పోవచ్చు. డ్రైవింగ్ వస్తే మహిళలు స్వయంగా వెళ్లి పనులు చేసుకోవచ్చు.



భర్త అనారోగ్యం డ్రైవింగ్ నేర్చుకునేలా చేసింది..

సల్మా ఫాతిమా, గృహిణి

మావారు కేటరింగ్ చేస్తారు. ఆయన రెండు నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. ఆయనను ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి ఎవరూ లేరు. దీంతో టూ వీలర్, కారు డ్రైవింగ్ నేర్చుకున్నా.



ధైర్యంగా నేర్చుకుంటున్నాం..

సాహితి, విద్యార్థిని

నేను బీటెక్ చదువుతున్నాను. కాలేజీకి వెళ్లడానికి డ్రైవింగ్ నేర్చుకోవాలనుకున్నా. 15 రోజుల్లోనే టూ వీలర్, కారు డ్రైవింగ్ నేర్చుకున్నా. అమ్ము డ్రైవింగ్ పాఠశాలలో మహిళా శిక్షకురాలు ఉండడం ధైర్యంగా వచ్చి డ్రైవింగ్ నేర్చుకుంటున్నాం.



నేషనల్ లెవల్ యోగాలో ప్రథమ, ద్వితీయ స్థానాలు



పురంశెట్టి స్వర్ణలత

ధర్మారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించిన నేషనల్ లెవల్ యోగా చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో ధర్మారంకు చెందిన పతంజలి యోగా సమితీకి ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించాయి. ఇండియన్ యోగా స్కూల్ వారు నిర్వహించిన ఈ పోటీల్లో పతంజలి యోగా సమితి సాధకులు పురంశెట్టి స్వర్ణలతకు ప్రథమ స్థానం, బొమ్మవరం వేణుగోపాల్‌రావుకు ద్వితీయ స్థానం లభించడంతో జిల్లా పతంజలి యోగా సహ ప్రబారి జంగిలి సుధాకర్, ధర్మారం మండల శాఖ మహిళా ప్రబారి మంజుల హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గంగాధర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంగాధర జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సయ్యద్ హనీఫా సీఎం కప్ ఖోఖో క్రీడల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయురాలు అనితకుమారి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ముగిసిన మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు

▸ చివరి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు ▸ స్వామివారికి బోనాల సమర్పణ



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం మల్లన్న పేట మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఆఖరి రోజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పోటెత్తింది. జాతర ఉత్సవాలు ఏడు వారాల పాటు వైభవంగా జరిగి ఆదివారం ఘనంగా ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు బెల్లం పానకంతో వం డిన బోనాలను నెత్తిన ఎత్తుకుని శివసత్తుల పూనకాల నడుమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి బోనాలు సమర్పిం చారు. ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ వేదమం త్రోచ్చరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు. అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ. 39,940 ఆదాయం సమకూరినట్లు ఆల య ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. జాతరలో ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. మండల వైద్యాధికారి డా. నరేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆల య ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు. ఈ కార్యక మంలో ఆలయ ఈవో విక్రమ్, తాజామాజీ ప్రజా ప్రతినిధులు సిద్దంకి నర్సయ్య, గోస్కుల రాజన్న, భేర కిషోర్, బీఆర్ఎస్పీ మండల శాఖ అధ్యక్షులు ఆవారి చందు, నాయకులు సిద్దం కి మల్లయ్య, భీమ సత్తయ్య, కడమండ సుధాకర్, మామిడిపెల్లి పోచమల్లయ్య, భీమ మహేష్, దాసరి మల్లయ్య, జాతర ఉత్సవాల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొదటి సారి ఆలయా న్ని సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్‌ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

మల్లన్న భక్తుల సందడి



ధర్మపురిలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు చేశారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు తిరుగు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నదీ వరకు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలుగనీయకుండా చర్యలు చేపట్టారు. భక్తులు స్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మల్యాల: మల్యాల శివారులోని మల్లెగుట్టపై ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మల్లెగుట్ట మల్లన్న సన్నిధిలో పట్నాలు, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందు నూతనంగా ఏర్పాటు చేసిన మెట్ల మార్గం, గుట్ట వెనుక బాగం నుంచి ఏర్పాటు చేసిన రహ దారి నుంచి భక్తులు మల్లెగుట్టపైకి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.

దాడి సంఘటనలో ఇరువర్గాలపై కేసులు నమోదు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవలతో పరస్పరం దాడి చేసుకున్న సంఘటనలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... ముకరంపుర కు చెందిన అజీమొద్దీన్‌కు అతడి అల్లుడైన షోయబ్‌కు కుటుంబ గొడవలు ఉన్నాయి. ఆదివారం అజీమొద్దీన్ ఇంటికి వచ్చిన షోయబ్ మరో వ్యక్తితో కలిసి దాడి చేసేందుకు యత్నించాడు. వారిని అజీమొద్దీన్ కత్తితో దాడి చేయగా అల్లుడు షోయబ్‌తో పాటు మరొకరికి గాయాలయ్యాయి. ఈ విష యంపై ఇరువురు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నా మని సీఐ తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి క్విజ్ జోన్-2024 పరీక్షకు స్పందన



క్విజ్ పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఐవీవై సీబీఎస్ఈ ఉన్నత పాఠశాలలో సిద్ధార్థ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు స్వర్గీయ దాసరి నరసింహారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి క్విజ్ జోన్-2024 ప్రిలిమినరీ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ప్రిలిమినరీ విభాగంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠ శాలల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం పరీక్ష ప్రారంబోత్సవ కార్యక్రమానికి కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు విశిష్ట అతిథిగా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్విజ్ పోటీలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో పోటీతత్వం అలవడు తుందన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయవచ్చని అన్నారు. సాంఘికశాస్త్ర విషయంలో ఎనిమిది సంవత్సరాల నుంచి క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామని పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ప్రిలిమినరీ రౌండ్ నుంచి ప్రతిభ చాటిన ఎనిమిది గ్రూపులను ఎంపిక చేసి ఫైనల్ రౌండ్ నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి సాగర్, ఐవీవై పాఠశాల చైర్మన్ పసుల మహేష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం జరిగేనా..?

● జగన్నాథ్‌పూర్-బోర్నపల్లి గిరిజనులకు కలగానే వారధి ● నిధులు సరిపోక ప్రారంభం కాని పనులు



జగన్నాథ్‌పూర్-బోర్నపెల్లి గ్రామాల మధ్య పెద్దవాగు

రాయికల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథ్‌పూర్-బోర్నపెల్లి గ్రామాలమధ్య వంతెన నిర్మాణం కాక గ్రామస్థుల కల నెరవేరడం లేదు. మావోయిస్టు ప్రభావిత గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఐఏపీ (ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్) ద్వారా రాయికల్ మండలం జగన్నాథ్‌పూర్-బోర్నపెల్లి గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి 2012-13లో రూ.కోటి నిధులు మంజూరు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. వాగుపై వంతెన నిర్మాణం రూ.కోటితో పూర్తి కాదని, నిధులు పెంచాలని నిపుణులు సూచించినా ఇప్పటివరకు ఫలితం లేకపోయింది. నాటినుంచి నేటివరకు ప్రతియేటా వంతెన నిర్మాణానికి నిధులు పెంచాలని ప్రతిపాదనలు పంపినా స్పందన లేకుండా పోతోంది. గతంలో పలుమార్లు హైదరాబాద్ నుంచి చీఫ్ ఇంజనీరు బృందం పర్యటించి వంతెన నిర్మాణానికి నివేదికలు తయారు చేసింది.

రూ.కోటితో పనులు మొదలు పెడితే వంతెన తక్కువ ఎత్తులో నిర్మించాల్సి వస్తోందని వర్షాకాలంలో గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల ప్రయోజనం ఉండదని అధికారులు నివేదిక ఇవ్వడంతో సదరు నిధులు నిలిపివేశారు. బోర్నపల్లి, జగన్నాథ్‌పూర్ రెండు గ్రామాల్లోని గిరిజనుల రాకపోకలకు అనువుగా ఉండే ఈ వంతెనకు ప్రభుత్వం మిగులు నిధులు ఈ ఏడాది ప్రణాళికలో మంజూరు చేస్తే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. రెండు గ్రామాల మధ్య ఈ పెద్దవాగులో యేటా వర్షాకాలంలో వాగు దాటుతూ పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.

అమలు కాని కేంద్రమంత్రి హామీ

రాయికల్ మండల కేంద్రంలో 2015 మార్చి 2న రాయికల్‌కు వచ్చిన కేంద్ర గిరిజన శాఖమంత్రి దృష్టికి గిరిజన సమస్యలు మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు తీసుకెళ్లగా జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటుతో పాటు జగన్నాథ్‌పూర్ వంతెనకు నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు నిధులు మంజూరు ఆచరణకు నోచుకోలేదు.

ప్రతిపాదనలు పంపినా...ఫలితం శూన్యం

పాదం లతరాజు, మాజీ సర్పంచ్, బోర్నపల్లి

ఈ వంతెన నిర్మాణం కోసం నిధులు చాలవని ఇంజనీర్ల బృందం అధిక నిధుల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. తూర్పున ఎక్కువ నిధులు వెచ్చిం చి అధికారులు ఈవైపు నిధులు కేటాయించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి గిరిజనుల కష్టాలు తీర్చాలి.



నీరు వచ్చినప్పుడు వాగు దాటలేము

ఆత్రం విజయ సర్పంచ్, జగన్నాథ్‌పూర్

వర్షాకాలంలో పెద్దవాగులోకి నీరు వచ్చినప్పుడు వాగు దాటాలంటే కష్టమే. వాగు దాటేటప్పుడు చాలా మంది గిరిజనులు గల్లంతయ్యారు. ఈ వాగుపై వంతెన నిర్మిస్తే గిరిజనులకు చాలా ఉపయోగం ఉంటుంది. ప్రభుత్వం వంతెనకు నిధులు మంజూరు చేసి గిరిజనుల కష్టాలు తీర్చాలి.



వంతెన నిర్మిస్తే దూరం తగ్గుతుంది..

కొడిపల్లి ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్, బోర్నపల్లి

వంతెన నిర్మిస్తే రెండు గ్రామాల మధ్య దూరం తగ్గి గిరిజనులకు ప్రయాణ భారం తగ్గుతుంది. వాగులో నీరు వస్తే బోర్నపల్లి నుంచి జగన్నాథ్‌పూర్ వెళ్లాలంటే 40 కిలోమీటర్లు తిరిగి వెళ్లాలి. అదే వంతెన నిర్మిస్తే కేవలం నాలుగు కిలో మీటర్ల దూరంతో జగన్నాథ్‌పూర్ చేరుకోవచ్చు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలి.



ఎస్‌యూ ఫార్మసీ కళాశాల సహాయ ఆచార్యుడు పల్లె క్రాంతిరాజుకు డాక్టరేట్



పల్లె క్రాంతిరాజు

గణేశ్‌నగర్/ఓదెల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల సహాయ ఆచార్యుడు పల్లె క్రాంతి రాజుకు డాక్టరేట్ పట్టా లభించింది. హైదరాబాదులోని జేఎన్టీయూ ఆచార్యులు జి కృష్ణమోహన్ పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ మొమోర్డీకా చారన్షియా ఆన్ ఫార్మకోకైనెటిక్స్ అండ్ ఫార్మాకోడైనమిక్స్ ఆఫ్ ఓరల్ హైపో గ్లైసిమిక్ డ్రగ్స్ ఇన్ డయాబెటిక్ ర్యాట్స్' అనే అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ పట్టా లభించింది. బహిరంగ మౌఖిక పరీ క్షకు ఎక్జామినర్‌గా కాకతీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు వై నర్సిం హారెడ్డి హాజరుకాగా క్రాంతి రాజు అన్ని ప్రశ్నలకు ప్రయోగాత్మకమైన ఉదాహరణలతో సమాధానాలు ఇచ్చారు. ఈ పరిశోధన మధుమేహ వ్యాధిగ్రస్తుల చికిత్సలో ఎంతగానో తోడ్పడుతుందని ఆచార్య వై నర్సింహా రెడ్డి సంతృప్తిని వ్యక్తం చేస్తూ పీహెచ్‌డీ పట్టా ప్రదానానికి ఆమోదం తెలిపారు. పీహెచ్‌డీ పట్టా పొందిన క్రాంతి రాజును శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య యు ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య యం వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిషోర్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీశైలం, విశ్వవిద్యాలయ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. క్రాంతి రాజుకు గతంలో చేసిన డయాబెటిస్ పరిశోధనకు గాను ఒక పేటెంట్ కూడా లభించింది. కాగా క్రాంతిరాజు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఉప్పరపల్లికి చెందిన వ్యక్తి. క్రాంతిరాజుకు డాక్టరేట్ రావడపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

విజ్ఞాన, విహారయాత్రలో తారుపల్లి విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని వివిధ ప్రదేశాలను తిలకించేందుకు విజ్ఞాన, విహారయాత్రకు వెళ్లినట్లు ప్రధానోపాధ్యాయులు శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయు శ్రీనివాస్, రమాదేవి, స్వరూప, ఆగయ్య, రాజమౌళి, సత్యప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

జూలపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాల్‌రాజ్‌పల్లి గ్రామశివారు లోగల పుట్టపోచమ్మ తల్లి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. అమ్మవారికి నూతనంగా ఆలయాన్ని నిర్మించేందుకు పెద్దపల్లి నివాసులు భూతుకూరి రాయమల్లు, సోదరులు వెంకటేష్, తిరుపతి, నర్సింగ్ ముందుకు వచ్చారు. నూతనంగా చేపట్టే ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం వారు గ్రామస్థులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణంకు ముందుకు వచ్చిన రాయమల్లు, అతడి సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అడువాల తిరుపతి, గసికంటి జనార్ధన్, కొట్టె సంజీవ్, అట్ల రాజయ్య, కొల్లూరి రాములు, కొల్లూరి లచ్చయ్య, కుంటూరి స్వామి, కోరికంటి భూమయ్య పలువురు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతున్న గోదావరిఖనికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. దాసరి నర్సయ్య కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను ఆదివారం ట్రస్ట్ అధ్యక్షులు పెండ్రు డిలైట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మారం రాజ్‌కుమార్‌యాదవ్ అందజేశారు. ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్న దాసరి నర్సయ్యకు అతడి కొడుకు శ్రీహరి సేవ చేస్తుండగా జారిపడి ఎడమ కాలు విరిగింది. దీంతో వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందిపడుతుండటంతో చేయూతనివ్వడం జరిగిందని ట్రస్ట్ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెండ్రు జీవన్‌రెడ్డి, వాలంటీర్లు నూతన్, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

రామగిరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విదేశీ విద్య పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర కోశాధికారి సముద్రాల విజయసారథి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా అర్హులైన విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి వివేకానంద ఓవర్సీస్ పథకం ద్వారా రూ.20 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం మార్పు, ఎన్నికల కోడ్ రావడం కారణాలతో సంబంధిత అమౌంట్‌లు లబ్ధిదారులకు చేరడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

బెలూన్‌తో శుభాకాంక్షలు..

సుల్తానాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ తమ పేరు ఫొటోలు న్యూఇయర్ శుభాకాంక్షలతో కూడిన బెలూన్‌ను ఆదివారం నెహ్రూ విగ్రహం వద్ద ఎగురవేశారు.

జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ



జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని ఆర్య వైశ్యభవన్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో గోదావరిఖనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. కటాస్ విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఎం.కార్తికేయన్, వాస్యశ్రీ, లక్ష్మి ప్రియ, అక్షిత, శివాశిష్, జశ్రిత, ప్రభవ్, ఎన్. మితాలి, జి.ప్రజ్ఞశ్రీ, ప్రవో ప్రతియ పటేల్, ఎం.తనుష్, నిహాల్ నందన్ బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. కాగా, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, కోచ్ కరాటే శ్రీనివాస్‌ను జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, సెక్రెటరీ ఎం.రమేష్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ ఎస్.శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నిదిష్, అభిజ్ఞ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ బాణేష్‌రావు, స్పందన క్లబ్‌సెక్రెటరీ వీరవిహార్, చిరంజీవి, ఆదిత్య, వంశీకృష్ణ అభినందించారు.

డీటీఎఫ్ ఆత్మీయ సమ్మేళనం



బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కలుసుకున్న డీటీఎఫ్ బృందం

పాలకుర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం డీటీఎఫ్ బృందం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉమ్మడి రామగుండం మండలం పరిధిలోగల రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో గత 30 ఏళ్లుగా పని చేసి ఇతర ప్రాంతాల్లో ఉన్నటువంటి వారు, ప్రస్తుతం పని చేస్తున్న డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి, రిటైర్డ్ సీనియర్ ఉపాధ్యాయులు భూమయ్య, రవీందర్ కుమార్, ముగ్దుం మొహియుద్దీన్, మల్లయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామ్‌కిషన్‌రావు, సంతోష్‌రెడ్డి, కానుగంటి రాజమౌళి, శంషుద్దీన్, రామగుండం పాలకుర్తి, అంతర్గాం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 80 మంది పాల్గొన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని సమన్వయపరిచారు.

కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన టీబీజీకేఎస్

- వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి

గోదావరిఖని, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపింది టీబీజీకేఎస్ అని యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య అన్నారు. ఆదివారం స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో జీడీకే 11ఇంక్లైన్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో కార్మికులకు అనేక హక్కులు సాధించడంతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశామని, జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన ప్రధానమైన డిపెండెంట్ ఎంప్లాయిమెంట్‌ను సాధించి యువ కార్మికులకు అండగా నిలబడ్డామని, తద్వారా వారి జీవితాలలో వెలుగులు నింపిన ఘనత టీబీజీకేఎస్‌దన్నారు. కార్మికుల కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎనలేని కృషి చేశారని, అధికారంలో లేకపోవడంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుండా పోయాయన్నారు. బొగ్గుగనులను ప్రైవేట్ పరంచేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలకు మద్దతు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక సమస్యల పరిష్కారం కోసం, హక్కులు కాపాడేందుకు టీబీజీకేఎస్ చిత్తశుద్ధితో పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా 11ఇంక్లైన్ పిట్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వాసర్ల జోసెఫ్, అసిస్టెంట్ కార్యదర్శిగా చంద్రు శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శులుగా పల్లె సురేందర్, సాయిచరణ్‌లను ఎన్నుకున్నారు. యూనియన్ కేంద్ర కార్యదర్శి మోదుంపల్లి రాజేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర అధికార ప్రతినిధి పర్లపెల్లి రవి, డివిజన్ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్, ఎల్ వెంకటేష్, చెల్పూరి సతీష్, కేంద్ర అంజయ్య, పర్లపెల్లి అభిషేక్, బొగ్గుల సాయి, మీస రాజు పాల్గొన్నారు.

మల్లన్న గుడికి పోటెత్తిన భక్తులు

ధర్మారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మల్లన్న జాతర ఉత్సవాల్లో చివరి ఆదివారం కావడంతో మొక్కులు చెల్లించడానికి భక్తులు పోటెత్తారు. మండల కేంద్రంలోని పర్వతాల మల్లన్నగా ప్రసిద్ధి చెందిన మల్లికార్జునస్వామి దేవాలయానికి ఉమ్మడి కరీంనగర్‌తో పాటు ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. ఈనెల 7న, దండివారంతో మొదలైన వేడుకలు ఆదివారంతో ముగిశాయి. భక్తులు తరలివచ్చి ప్రత్యేక బోనాలు, పట్నాలతో మొక్కులు చెల్లించారు.

వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

అంతర్గాం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అంతర్గాం, పాలకుర్తి మండలాల వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు శనివారం రాత్రి బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో ప్రథమ పాలకుర్తి మండలం బామ్లనాయక్‌తండా జట్టు, ద్వితీయ అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి గ్రామ తండా జట్టు, తృతీయ అంతర్గాం టీం సాధించాయి. అంతర్గాం తహసీల్దార్ తూం రవీందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. మండల కేంద్రంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ అంగోత్ రవినాయక్, వైస్‌చైర్మన్ సాయికిరణ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల శ్రీకాంత్, కోలా ప్రణీత్‌గౌడ్, ట్రస్ట్ సభ్యులు బడికల మహేష్, మాడ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు కోలా రాంమూర్తిగౌడ్, మాడ నారాయణరెడ్డి, పనగంటి సత్యనారాయణ, దామోదర్‌రావు, బామ్లానాయక్ తండా సర్పంచ్, యువకులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో మాజీ ఉపసర్పంచ్ మృతి



కనుకుంట్ల శ్రీనివాస్(ఫైల్)

ఓదెల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లి మాజీ ఉపసర్పంచ్ కనుకుంట్ల శ్రీనివాస్(42) ఆదివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందారు. గత స్థానిక ఎన్నికల్లో ఉప్పరపల్లి ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కొన్నాళ్ల తర్వాత అనారోగ్యం వెంటాడడంతో గ్రామపంచాయతీ సమావేశాలకు గైర్హాజరుకావడంతో ఫిర్యాదు మేరకు పంచాయతీ అధికారి శ్రీనివాస్‌ను పదవి నుంచి తొలగించారు. కొంతకాలం తర్వాత బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఐదు రోజుల క్రితం ఇంటివద్ద బ్రెయిన్ స్ట్రోక్‌తో కుప్పకూలడంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీనివాస్ మృతిపై ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

పెరిగిన నేరాలు..

(5వ పేజీ తరువాయి)



కొల్లగొట్టిన ఏటీఎం కేంద్రం వద్ద విచారణ జరుపుతున్న పోలీసులు(ఫైల్)

వేదికగా ఆకర్షించి మోసాలకు పాల్పడుతున్న ముఠాను జూలై సుల్తానాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రూ.33లక్షల నగదును స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. మినీ ఏటీఎంలను కొల్లగొట్టి లక్షలు దండుకున్నారు. ఇలా ప్రతిరోజు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదవుతున్నాయి. జిల్లాలో 147 సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా రూ.3కోట్లకు పైగానే జనం సొమ్ము పోగొట్టుకున్నారు. ఇళ్లలో ఉన్న పాత ఫోన్‌లను తీసుకుని విలువైన వస్తువులు ఇస్తామంటూ ప్రజలను నమ్మించి ఆ ఫోన్‌లను జార్ఖండ్‌లోని సైబర్ నేరస్థులకు అమ్ముతున్న ముఠాను రామగుండంలో పోలీసులు పట్టుకున్నారు. వారివద్ద నుంచి 4వేల పాత ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రాలు దాటుతున్న రేషన్ బియ్యం..

రేషన్ బియ్యం దందా నిరాటంకంగా సాగుతోంది. సుల్తానాబాద్, ధర్మారం, గోదావరిఖని, బేగంపేటలోని నలుగురు కింగ్ పిన్‌లు రేషన్ దందాను కొనసాగిస్తున్నారు. ప్రతినెల వేల టన్నుల బియ్యాన్ని మహారాష్ట్రకు, అక్కడినుంచి కృష్ణపట్నం ఓడరేవుకు తరలిస్తున్నారు. ఈఏడాది జిల్లాలో 63 కేసులు నమోదు కాగా, 1990 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఏసీబీ వలలో తహసీల్దార్లు..

ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై ఏసీబీ దృష్టి పెట్టింది. జిల్లాలో రెండు మండలాల తహసీల్దార్లు ఏసీబీకి పట్టుబడ్డారు. కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్ జావిద్‌పాషా, అంతర్గాం తహసీల్దార్ రమేష్, ఆర్ఐ శ్రీధర్, పెద్దపల్లి ఇరిగేషన్ ఏఈ నర్సింగారావు ఏసీబీ వలలో చిక్కారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణలు జరిగింది. ఎన్టీపీసీలోని ప్రాజెక్టు కార్యాలయాల్లో విజిలెన్స్ దాడులు జరిపి తనిఖీలు నిర్వహించి సీజ్ చేసింది.

ఏటీఎంలను కొల్లగొట్టారు... ఆయిల్ డిపోలకే కన్నం వేశారు..

ఈ ఏడాది మహారాష్ట్ర, బీహార్ ముఠాలు రామగుండంలోని ఏటీఎంలను కొల్లగొట్టాయి. గోదావరిఖని గంగానగర్, ఎఫ్‌సీఐ గౌతమినగర్ హనుమాన్ టెంపుల్ సమీపంలోని ఏటీఎంలను ధ్వంసం చేశారు. గౌతమినగర్ ఏటీఎంలో రూ.27.59లక్షల సొమ్మును దోచుకువెళ్లారు. ఈ కేసులో ఒకరిని మాత్రమే అరెస్టు చేయగలిగారు. ఇక కుందనపల్లిలోని ఆయిల్ డిపోలకే కన్నం వేశారు. డీజిల్, పెట్రోల్ దొంగలు ఆయిల్ డిపోల పక్క నుంచి లోపలికి పైపులు వేసి మోటార్ల ద్వారా డీజిల్‌ను చోరీ చేశారు. టాస్క్‌ఫోర్స్ దాడులతో ఈ దందా వెలుగు చూసింది.

రైస్ మిల్లులపై కేసులు..

రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి ఇచ్చిన ధాన్యాన్ని అమ్ముకున్న పలు రైస్ మిల్లులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంథనిలోని రెండు రైస్ మిల్లుల యజమానులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని అమ్ముకున్నట్లు గుర్తించడంతో కేసు నమోదు అయ్యింది.

పేకాట జోరు...

జిల్లాలోని పలు ప్రాంతాల్లో లాడ్జ్‌లు పేకాట డెన్‌లుగా మారాయి. ఈ ఏడాది సుందిళ్ల గ్రామంలో ఒక పేకాట డెన్‌పై దాడి చేసిన పోలీసులు పేకాటలో చిప్ సిస్టంను వాడుతున్నట్లు గమనించారు. గోవ తరహాలో కొందరు వ్యక్తులు కంపెనీలు ఏర్పాటుచేసి లాడ్జ్‌లు, మామిడితోటలు, వివిధ ప్రాంతాల్లో పేకాట ఆడిస్తున్నట్లు గుర్తించారు. జిల్లాలో 56కేసుల్లో 367మందిని అరెస్టు చేశారు. 48.94లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

రహదారులు రక్తసిక్తం..

జిల్లాలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల్లో 131మంది మరణించగా, 376మందికి గాయాలయ్యాయి. గత ఏడాది 107రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఈ ఏడాది 131మంది మరణించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 6725 కేసులు నమోదు చేయగా, రూ.44.14లక్షల జరిమానా విధించారు. డ్రంకెన్ డ్రైవ్‌ను నివారించేందుకు రెండవసారి పట్టుబడిన వారికి సామాజిక సేవ, ట్రాఫిక్ నిబంధన అమలువంటి శిక్షలు విధిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం..



సమావేశమైన జనగామ జడ్పీ హైస్కూల్ పూర్వవిద్యార్థులు



జూలపల్లి శారద విద్యనికేతన్ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ జనగామ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(పెద్దబడి) 1992-1993 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతికి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. మూడు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న చిన్ననాటి జ్ఞాపకాలను వారంతా నెమరువేసుకున్నారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. కష్టసుఖాలను పంచుకున్నారు. ఆడిపాడి ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యనేర్పిన గురువులు పి.భూమయ్య, జి.కిషన్‌రావు, సయ్యద్ సలీం, ఆర్.విశ్వనాథంలను శాలువాలతో ఘనంగా సన్మానించి పూర్వవిద్యార్థులందరూ పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో సతీష్‌బాబు, చంద్రశేఖర్, హరిబాబు, లక్ష్మణ్, ఎండి రజాక్, ఎస్.రమేష్, వొజ్జల వెంకటేశ్వర్లు, జనగామ రవి, శరవంద్, ఊర్మిళ, గౌసియాబేగం, రజిని, పద్మ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

● కమాన్‌పూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలపల్లి గ్రామంలోని శారద విద్యనికేతన్ పాఠశాలలో 2006-07 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ చేయూత

పాలకుర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బాధిత కుటుంబానికి బామ్లానాయక్‌తండా మాజీ సర్పంచ్ బదావత్ రాజునాయక్ ఆదివారం అండగా నిలిచారు. రాజీవ్‌నగర్ తండాకు చెందిన అలోత్ రాజం-సునీత దంపతులకు సంశిత(6) వివక్షిత(4) ఉన్నారు. రెండేళ్ల క్రితం అనారోగ్యంతో అలోత్ రాజం మృతిచెందాడు. అప్పటినుంచి ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోయింది. విషయం తెలుసుకున్న రాజునాయక్ స్పందించి వివక్షిత పేరుతో కేంద్ర ప్రభుత్వ పథకం అయిన సుకన్య సమృద్ధి యోజన పోస్టల్ ఖాతా ప్రారంభించారు. ఏడాదికి ఎనిమిది వేల చొప్పున 15ఏళ్ల పాటు బాలిక పేరున డబ్బులు డిపాజిట్ చేస్తానని ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ సమ్మయ్య, పుల్‌చంద్, నగావత్ కిషన్, బదావత్ అంజి, ఇస్లావత్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

'సంపాదన పెరిగినంత మాత్రాన చరిత్ర మారదు'

రామగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంపాదన పెరిగినంత మాత్రాన చరిత్ర మారదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్ ఎద్దేవా చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం వార్డు మెంబర్ కూడా కాని ఒక కాంగ్రెస్ నాయకుడి ఇంటికి ఇద్దరు పోలీస్ అధికారులు వెళ్లి సన్మానం చేయించుకోవడం ఎంతవరకు సమంజసమని తమ నాయకుడు ప్రశ్నించడంతో అహం దెబ్బతిన్నట్లున్నదన్నారు. ఇద్దరు ఏసీపీలకు తనతో వ్యక్తిగత సంబంధాలున్నాయని చెప్తున్న సదరు నాయకుడు వాటిని అడ్డం పెట్టుకునే తమపై అక్రమ కేసులు పెట్టిస్తున్నాడా అని ప్రశ్నించారు. అధికారం ముసుగులో తమ నాయకున్ని కించపరిస్తే సహించేది లేదన్నారు. సంపద పెరిగిన దగ్గర నుంచి చరిత్ర మొదలు కాదని, ఎవరి చరిత్ర ఏంటో ప్రజలకు తెలుసునన్నారు. వైన్‌షాప్ పెట్టినప్పుడు ఒక్క రూపాయి పెట్టుబడి లేకుండా భాగస్వామిగా ఉన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. చరిత్ర అంటే ఎవరికి వారు చెప్పుకునేది కాదని, మన గురించి పది చెప్పుకునేది చరిత్ర అనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. మరోసారి తమ నాయకునిపై ఆరోపణలు సహించే ది లేదని హెచ్చరించారు. సమావేశంలో శంకేషి రవీందర్, మాదరవేణి కుమార్, కొండవేన ఓదెలు, ఆసంతిరుపతి, బాద్ర పు ప్రశాంత్, గద్దల శంకర్, మట్టరాజు, కాట అనిల్, ఇజ్జగిరి సాకేత్, బండి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.